
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 4 । మే । 2024



సోమశిలలో 8.11 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 8.112 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 210 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,490
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,582
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,779
సవర (8 గ్రాములు)	రూ.54,232



స్వేచ్ఛాయుత ఎన్నికలే లక్ష్యంగా..

స్వేచ్ఛాయుత ఎన్నికలే లక్ష్యంగా పోలీస్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పల్లె నిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

10లో

న్యూస్‌రీల్

ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ



పరిశీలిస్తున్న డీఆర్వో, ఆర్డీఓ

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ప్రక్రియను డీఆర్వో లవన్న, నెల్లూరు రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ మలోల పరిశీలించారు. అనంతరం పలు సూచనలు చేశారు.

పోలింగ్ కేంద్రాలకు నిరంతర విద్యుత్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో నిరంతర విద్యుత్‌ను అందించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. జిల్లాకు చెందిన ఈఈలు, డీఈఈలు, ఏఈలు, అకౌంట్స్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల సమీపంలోని 33 కేవీ, 11 కేవీ ఫీడర్లను నిరంతరం పరిశీలించాలని సూచించారు. స్ట్రాంగ్‌రూమ్‌లను ఏర్పాటు చేసే ప్రాంతాలకు సైతం నిరంతరం విద్యుత్‌ను అందించాలని కోరారు. ఈఈ (టెక్నికల్) శేషాద్రి బాలచంద్ర పాల్గొన్నారు.

పోలింగ్ అధికారులకు శిక్షణ

నెల్లూరు (దర్గామిట్ట): ఈవీఎంలు, వీవీప్యాట్ల నిర్వహణపై పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎన్నికలను సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం వెంకటేశ్వరపురం సమీపంలోని ఎస్ఎస్టీ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, జేసీ సేతు మాధవన్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి తీవ్రతపై అప్రమత్తత అవసరం

జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్న తరుణంలో కార్మికులు, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వివిధ దుకాణాల్లో పని చేసే కార్మికులు, ఉద్యోగులకు ఎండ తీవ్రతను బట్టి పనివేళలను నిర్ణయించాలని నిర్వాహకులకు సూచించారు. ఓఆర్ఎస్, ఐవీ ఫ్లూయిడ్స్, ప్రాథమిక చికిత్స కిట్లను సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ షురూ..

- తొలి రోజే 2,22,917 మేర అందజేత
- జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(బారకాసు): జిల్లా వ్యాప్తంగా ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రారంభమైందని, తొలి రోజు 2,22,917 మేర పంపిణీ చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు స్లిప్పులను ప్రతి ఇంటికీ బీఎల్వోలు, సూపర్‌వైజర్ల ద్వారా ఈ నెల ఎనిమిది వరకు అందజేయనున్నామని వివరించారు. హోమ్ ఓటింగ్ కార్యక్రమం ప్రారంభమైందని వెల్లడించారు. పోలింగ్ రోజున మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, దీనికి జిల్లా ఎన్నికల అధికారి నుంచి అనుమతి పొందాలని సూచించారు. అనుమతుల కోసం సువిధ పోర్టల్లో దరఖాస్తు చేసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు.

ప్రతి అంశం పారదర్శకంగా..

ఇతర జిల్లాల నుంచి వచ్చిన వ్యక్తులు పోలింగ్‌కు 48 గంటల ముందు వెళ్లిపోవాలని.. లాడ్జీలు, హోటళ్లలో తనిఖీలను విస్తృతంగా చేపట్టనున్నామని వెల్లడించారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని అత్యంత పారదర్శకంగా చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో లవన్న, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మురళీధర్‌రెడ్డి, టీడీపీ నుంచి రసూల్, హరికృష్ణ, కాంగ్రెస్ నుంచి బాలసుధాకర్, ఎలక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో బాబు ఏడిపించేన్

పింఛన్లు సకాలంలో పొందుతూ మీరింత సంతోషంగా ఉంటే.. నేను తట్టుకోగలనా..? మీరెంత కష్టపడితే నాకంత ఆనందం అనే రీతిలో టీడీపీ అధినేత చంద్రబాబు ముందుకెళ్తున్నారు. వాస్తవానికి ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ నగదును అందుకొని తమ అవసరాలను తీర్చుకుంటూ ఎంతో సుఖంగా ఉండే అవ్వాతాతలపై ఆయన కన్నెర్ర చేశారు. తన మనుషుల ద్వారా ఎన్నికల కమిషన్‌ను ఆయన ఆశ్రయించి.. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకున్నారు. ఫలితంగా వృద్ధులు, దివ్యాంగులు నానా కష్టాలు పడుతున్నారు. తాజా నిబంధన మేరకు పింఛన్ నగదు పొందేందుకు బ్యాంకులకు వీరు శుక్రవారం పోటెత్తారు. అక్కడ నిరీక్షించలేక.. ఎండ తీవ్రతను తట్టుకోలేక సొమ్మసిల్లిపోయారు. తమకింత కష్టాన్ని మిగిల్చిన చంద్రబాబుకు గుణపాఠం చెప్పడం తథ్యమని ముక్తకంఠంతో చెప్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నెల్లూరులోని బారకాస్ సెంటర్‌లో గల ఎస్‌బీఐ శాఖ వద్ద వృద్ధుల నిరీక్షణ

ఇది పద్ధతేనా..?



వృద్ధులకు సంబంధించిన పింఛన్ నగదును బ్యాంకుల్లో జమచేయడం పద్ధతి కాదు. మా గ్రామంలోని చాలా మంది పింఛన్ల నగదును నెల్లూరులోని ఐసీఐసీఐ బ్యాంకులో జమచేశారని తెలిసింది. అక్కడికెళ్లి పింఛన్ నగదు పొందడం వృద్ధుల వల్ల అయ్యే పనికాదు. బ్యాంకుల వద్దకొచ్చి చూస్తే వృద్ధుల బాధలు ఏమిటో అర్థమవుతాయి.

– ఈశ్వరయ్య, దేగపూడి, పొదలకూరు మండలం

బ్యాంక్ ఖాతానే లేదు



అసలు బ్యాంక్ ఖాతానే నాకు లేదు. పింఛన్ ఎక్కడ తీసుకోవాలో తెలియడంలేదు. ఇంటికొచ్చి అందజేస్తారా.. లేక సచివాలయానికి వెళ్లి పొందాలాననే అంశంపై స్పష్టత లేదు. చంద్రబాబుతో వృద్ధులకు ఇన్ని కష్టాలు దాపురించాయి. ఇన్ని రోజులు ఇంటికి వలంటీర్లు వచ్చి ఏ బాధలేకుండా నగదును ఇచ్చే వారు. ఎండల్లో ప్రస్తుతం తిరగాలంటేనే భయంగా ఉంది.

– బోడా చంద్రమౌళి, చిట్టేపల్లి, పొదలకూరు మండలం

ఆయనకు గుణపాఠం చెప్పడం ఖాయం



పింఛన్‌దారులపై చంద్రబాబు కక్షగట్టారు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే టీడీపీ పాలన గుర్తుకొస్తోంది. పింఛన్ల కోసం బ్యాంకుల వద్దకెళ్లి గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చలువతో ఐదేళ్లుగా కష్టమంటే ఏమిటో మాకు తెలియలేదు. ఇప్పుడు కుట్రలతో ముందుకొస్తున్న చంద్రబాబుకు గుణపాఠం చెప్పేందుకు మాలాంటి వారు సిద్ధంగా ఉన్నారు.

– నల్లగొండ లక్ష్మమ్మ, సీతారామపురం



నా వల్ల కాదు బాబోయ్..!



సీతారామపురంలో..



ఊత కర్ర సాయంతో వస్తూ..



అయ్యో.. అవ్వా

తిరుగుతున్నా ప్రయోజనమేదీ..?



పింఛన్ కోసం గత నెల నుంచి కష్టాలు ఎదురవుతున్నాయి. ఈ నెల్లో పరిస్థితి దయనీయంగా మారింది. నగదు కోసం తిరుగుతున్నా ప్రయోజనం లభించడం లేదు. ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకులను సంప్రదిస్తే, నగదు జమకాలేదని చెప్తున్నారు. మండుటెండలో అక్కడికీ.. ఇక్కడికీ తిరగడం నా వల్ల కావడంలేదు. పింఛన్లు ఆపించిన వ్యక్తులకు శాపం తగులుతుంది.

– చల్లా నరసమ్మ, దుత్తలూరు బీసీ కాలనీ

తగిన మూల్యం చెల్లించుకుంటారు



వలంటీర్ల ద్వారా వృద్ధులు, దివ్యాంగులకు అందజేసే పింఛన్లను అడ్డుకున్న చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకుంటారు. వింజమూరులోని బ్యాంక్‌కు వెళ్లి పింఛను నగదును తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఓ రోజు మొత్తాన్ని బ్యాంకుల వద్దే కేటాయించాల్సి వచ్చింది. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేస్తున్న చంద్రబాబుకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తాం.

– చినమాలకొండారెడ్డి, కృష్ణారెడ్డిపాళెం, కలిగిరి మండలం

కూటమి మేనిఫెస్టోపై నమ్మకమేదీ..?



మాట్లాడుతున్న చంద్రశేఖర్

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్డీఏ కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోపై ఉద్యోగులకు నమ్మకం లేదని ప్రభుత్వ సలహాదారు నలమారు చంద్రశేఖర్ పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వోద్యోగులకు చేసిన మేలును పక్కన బెట్టి కొందరు స్వార్థపరులు విమర్శలు చేయడమేమిటని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో ఉద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. ఓట్లను కొల్లగొట్టాలనే లక్ష్యంతో మోసపూరిత మేనిఫెస్టోను చంద్రబాబు విడుదల చేశారని మండిపడ్డారు. ఆయన మాటలను ఎవరూ విశ్వసించబోరని స్పష్టం చేశారు.

జూలై ఒకటి నుంచి 12వ పీఆర్సీ

12వ పీఆర్సీ కోసం ప్రత్యేక కమిషన్‌ను నియమించారని, జూలై ఒకటి నుంచి దీన్ని అందజేయనున్నారని వివరించారు. డీఏ బకాయిలను ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పింఛనర్లకు అదనపు క్వాంటమ్ మూడు శాతాన్ని అందజేయనున్నారని చెప్పారు. చంద్రబాబు కుట్ర ఫలితంగా వలంటీర్ల సేవలను నిలిపేశారని, పింఛన్‌దారుల ఉసురు ఆయనకు తగులుతుందని స్పష్టం చేశారు. లోకేశ్ రెడ్‌బుక్ వ్యవహారంపై ఉద్యోగులు మండిపడుతున్నారని చెప్పారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురి డీబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డీబారయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన ఐదో, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో 5447 మందికి గానూ 4988 మంది హాజరయ్యారని చెప్పారు. మధ్యాహ్నం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షకు 2717 మందికి గానూ 223 మంది గైర్హాజరయ్యారని వివరించారు.

సీఎం జగన్ రాక నేడు



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న తలశిల రఘురామ్

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరుకు శనివారం రానున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మలి విడత ప్రచారంలో భాగంగా రాష్ట్రంలోని మూడు నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలను రోజూ ఆయన నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లా పలమనేరులో సభ అనంతరం నగరంలోని వీఆర్సీ గ్రౌండ్స్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు మధ్యాహ్నం 3.20కు ఆయన చేరుకోనున్నారు. అనంతరం గాంధీబొమ్మ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్న ప్రాంతానికి 3.30 గంటలకు చేరుకుంటారు. అనంతరం 3.50కు ప్రసంగించనున్నారు. తదుపరి హెలిప్యాడ్‌కు 4.35కు చేరుకొని రేణిగుంటకు పయనమవ్వనున్నారు. ఏర్పాట్లను ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు. సభను విజయవంతం చేయాలని చంద్రశేఖర్‌రెడ్డి కోరారు.

భారీ భద్రత ఏర్పాట్లు

నెల్లూరు(క్రైమ్): నగరంలో శనివారం నిర్వహించనున్న బహిరంగసభలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొననుండటంతో ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ నేతృత్వంలో పోలీస్ అధికారులు కట్టుదిట్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడలో సీఎంపై ఇటీవల చోటుచేసుకున్న హత్యాయత్నం ఘటనను దృష్టిలో ఉంచుకొని పటిష్టమైన చర్యలు చేపడుతున్నారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎస్పీతో పాటు ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు ఇలా వెయ్యి మందికిపైగా సిబ్బందిని బందోబస్తు విధులకు కేటాయించారు. వీఆర్సీ గ్రౌండ్స్‌లోని హెలిప్యాడ్‌తో పాటు సభ జరగనున్న ప్రాంతాన్ని ఎస్పీ పరిశీలించారు.

కలవని కూటమి జెండాలు

- ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలన్న జనసైనికులు
- రోడ్‌షోలో కానరాని అభ్యర్థులు
- రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభం



టీడీపీ జెండాలను ప్రదర్శిస్తున్న తమ్ముళ్లు

నెల్లూరు(పొగతోట): ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ శుక్రవారం నిర్వహించిన రోడ్‌షోలో కూటమి జెండాలు కలవలేదు. వీఆర్సీ సెంటర్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు విడివిడిగా జెండాలను పట్టుకొని నిలబడ్డారు. అక్కడి నుంచి నర్తకి సెంటర్ వరకు పసుపు బెలూన్లనే కట్టారు. వీఆర్సీ సెంటర్‌లో కట్టిన పసుపు బెలూన్లను రోడ్‌షో ప్రారంభానికి ముందే జనసేన కార్యకర్తలు పగలకొట్టారు. రోడ్‌షో రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. జై జగనన్న.. ఫ్యాన్ గుర్తుకే మన ఓటు అంటూ జనసేన జెండాలను పట్టుకున్న కొందరు కార్యకర్తలు నినదించడం విశేషం. రోడ్‌షోలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ టాప్ ఎండ్‌లో.. టీడీపీ నెల్లూరు లోక్‌సభ, సిటీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నారాయణ వాహనం లోపల కూర్చున్నారు. రోడ్‌షోకు లైటింగ్ లేకపోవడం.. ఆలస్యంగా ప్రారంభం కావడంతో అభిమానులు అసహనం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్‌నగర్, ఏసీనగర్, మసీద్ సెంటర్, కోటమిట్ట, నెల్లూరు రూరల్ నుంచి ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున ఇచ్చి తీసుకొచ్చారు. కాగా రోడ్‌షోకు నారాయణ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులను తరలించడం గమనార్హం. మరోవైపు ఓటు హక్కు లేని వారే కార్యక్రమానికి ఎక్కువగా హాజరయ్యారు.

అవగాహన లేకుండా విమర్శలా..?

- ప్రశాంతిరెడ్డి తీరు విడ్డూరం
- టీడీపీ నేతల అరాచకాలను మాపై రుద్దొద్దు
- ముస్లింల రిజర్వేషన్లను ఎత్తేస్తామన్న బీజేపీని సమర్థిస్తారా..?
- వేమిరెడ్డి పార్టీ మారే కుట్ర గత జూన్‌లోనే జరిగింది
- వైఎస్సార్సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి



రోడ్‌షోలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

కొడవలూరు: టీడీపీ కోవూరు అభ్యర్థి ప్రశాంతిరెడ్డి అవగాహన లేకుండా విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి ఆరోపించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. పల్లెలను పట్టణాలుగా మారుస్తామంటూ ఆమె ప్రకటించడం హాస్యాస్పదమని విమర్శించారు. పల్లెల్లేకుండా.. వ్యవసాయం చేయకుండా రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిస్తే వ్యవసాయ భూమి మృగ్యమై ఆహారానికి కరువొస్తుందనే అంశాన్ని ఆమె తెలుసుకోవాలని హితవు పలికారు. పల్లెల్లో వ్యవసాయంపై ఆధారపడి 65 శాతం మంది ఉన్నారని.. పట్టణాలుగా మారిస్తే వ్యవసాయంపై ఆధారపడిన రైతులేమి కావాలో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

ఇష్టానుసారంగా మాట్లాడటం తగదు

అవసరమైతే రోడ్లను విస్తరించాలని, ఆ సమయంలో స్థలం కోల్పోయిన వారికి మార్కెట్ విలువలో రెండున్నర రెట్ల పరిహారాన్ని అధికంగా ఇవ్వాల్సి ఉంటుందని, అయితే ఈ విషయాలపై అవగాహన లేకుండా ప్రశాంతిరెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బలవంతపు వసూళ్లకు పాల్పడుతోంది టీడీపీ నేతలైతే వాటిని తమ పార్టీ నేతలకు అన్వయించి విమర్శలు చేయడమేమిటని ప్రశ్నించారు. టీడీపీకి చెందిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి చేసే బలవంతపు వసూళ్లను మరిచి.. తమ పార్టీ నేతలపై నిందలు మోపడం సబబుకాదన్నారు.

నార్తురాజుపాళెన్ని ఆదర్శంగా తీర్చిదిద్దా

ఎన్నికల్లో చెప్పిన విధంగా నార్తురాజుపాళెన్ని ఆదర్శంగా తీర్చిదిద్దామని ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, గంధం వెంకటశేషయ్య, కొండా శ్రీనివాసులురెడ్డి, నేతలు మాణిక్యరావు, కరిముల్లా, జనార్దన్‌రెడ్డి, బండి పెంచలయ్య, బచ్చు శ్రీనివాసులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు కులపిచ్చి

చంద్రబాబుకు కులపిచ్చి అధికంగా ఉందని, అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దగ్గరికి చేర్చుకొని వారికి ఉన్నత స్థానాలను కల్పించారని విజయసాయిరెడ్డి కొనియాడారు. వేమిరెడ్డి దంపతులు పార్టీ మారే కుట్ర గత జూన్‌లోని జరిగిందని, ఇదే విషయాన్ని లోకేష్ బాహాటంగా ప్రకటించిన అంశాన్ని ప్రస్తావించారు. ముస్లింల కోసం నాలుగు శాతం రిజర్వేషన్లను దివంగత సీఎం వైఎస్సార్ కేటాయించారని, దీన్ని ఎత్తేస్తామని బీజేపీ నేతలు ప్రకటిస్తున్నారని, ఈ వ్యవహారాన్ని సమర్థిస్తున్నారా అనే అంశంపై వేమిరెడ్డి దంపతులు క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదేళ్ల పాటు రాజకీయాల్లో ఉండి జిల్లాకు సేవ చేయాలని సంకల్పించానని.. ఎంపీగా తనను, కోవూరు ఎమ్మెల్యేగా ప్రసన్నకుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

అక్రమార్కులపై ఉక్కుపాదం

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం అక్రమ రవాణాపై పోలీస్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోంది. బాలాజీనగర్ పరిధిలో రూ.రెండు లక్షలు, రాపూరులో రూ.1,09,800, సంగంలో రూ.1,69,600 నగదును ఎలాంటి పత్రాల్లేకుండా తరలిస్తుండగా పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నగదును ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించారు.

- మర్రిపాడులో 36, కలువాయిలో 45, కలిగిరిలో 108.. ఎస్ఈబీ అధికారుల ఆధ్వర్యంలో 133 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసులు నమోదు చేశారు.
- కలిగిరిలో 1700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.
- చెక్‌పోస్టుల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

మహిళా ఓటర్లే అధికం

- జిల్లాలో ఓటర్లు @ 20,62,439
- తుది జాబితా విడుదల

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల నేపథ్యంలో తుది ఓటర్ల జాబితాను జిల్లా అధికారులు శుక్రవారం వెల్లడించారు. జిల్లాలో మొత్తం 20,62,439 ఓటర్లు ఉండగా, వీరిలో మహిళలు 10,52,819.. పురుషులు 10,08,792 కాగా, ఇతరులు 828 మంది ఉన్నారు.

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
కందుకూరు	1,13,224	1,15,729	92	2,29,045
కావలి	1,17,152	1,21,465	120	2,38,737
ఆత్మకూరు	1,05,873	1,09,579	67	2,15,519
కోవూరు	1,29,004	1,38,374	83	2,67,461
నెల్లూరు సిటీ	1,16,764	1,22,713	114	2,39,591
నెల్లూరు రూరల్	1,36,691	1,44,237	80	2,81,008
సర్వేపల్లి	1,12,812	1,19,196	49	2,32,057
ఉదయగిరి	1,20,108	1,21,743	194	2,42,045
వెంకటగిరి (జిల్లాలో ఉన్న మండలాలు)	57,164	59,783	29	1,16,976
మొత్తం	10,08,792	10,52,819	828	20,62,439



క్లుప్తంగా

ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం



ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఇందుకూరుపేట: ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న కొత్తూరులో శుక్రవారం జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో టీబీ రెఫరెల్స్ పెంచాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు కిశోర్‌కుమార్, బ్రహ్మేశ్వరనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని తొలుత ఎంపీడీఓ సాయి లహరి పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భీమవరపు వెంకటకృష్ణారెడ్డి, సర్పంచ్ విజయమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, సూపర్‌వైజర్లు రమ, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- జగదేవిపేటకు చెందిన జక్కా శ్రీనివాసులు రెడ్డి (జేఎస్ రెడ్డి)కి పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. శ్రీనివాసులురెడ్డి తన సొంత స్థలంలో మాతృమూర్తి జక్కా కామేశ్వరమ్మ జ్ఞాపకార్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మించి స్వగ్రామంతోపాటు, పరిసర ప్రాంత గ్రామాలకు వైద్యసేవలందేలా కృషిచేశారు. రెండు రోజులు క్రితం ఆయన మృతిచెందారు. దీంతో నివాళులర్పించారు.

పల్లెనిద్ర కార్యక్రమానికి శ్రీకారం



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసు అధికారి

నెల్లూరు(క్రైమ్): స్వేచ్ఛాయుతా వాతావరణంలో ఎన్నికలు, నేర నియంత్రణే లక్ష్యంగా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ 'పల్లెనిద్ర' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆయన ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు సమస్యాత్మక, నేరాలు అధికంగా జరిగే గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు. స్థానికంగా ఉన్న యువత, గ్రామపెద్దలతో మమేకమవుతున్నారు. రాత్రివేళల్లో సమావేశాలు నిర్వహిస్తూ అక్కడే బస చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఏ చిన్న సమస్య తలెత్తినా క్షణాల్లో సమాచారం తెలిసేలా నిఘా వ్యవస్థను పటిష్టం చేసుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నిబంధనలు, ప్రవర్తనా నియమావళి, సీ విజిల్ యాప్, బైండోవర్ షరతులు తదితరాలను ప్రజలకు వివరిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన, రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మద్యం, నగదు, గంజాయి ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు గ్రామస్తులు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచిస్తున్నారు. జైలు నుంచి విడుదలైన వ్యక్తులు, స్థానికేతరులపై ప్రత్యేక నిఘా ఉంచారు. మరోవైపు సైబర్ నేరాలు, ఉద్యోగాల పేరిట మోసాలు, మహిళలపై జరిగే నేరాలు, ఇతర చట్టాలు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేందుకు అండగా ఉన్నామని భరోసానిస్తున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్రాధ్యక్షుడిగా బాబు



ఏసుపోగు బాబుతో నేతలు

నెల్లూరు(వేదాయపాళెం): ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్రాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన ఏసుపోగు బాబు మాదిగ నియమితులయ్యారు. నెల్లూరులోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ఏసుపోగు బాబును నూతన అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండా వెంకటేశ్వర్లు, తాటిపర్తి మణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 143
లేయర్ (లైవ్)	: 90
బ్రాయిలర్ చికెన్	: 254
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 284
లేయర్ చికెన్	: 153



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40



చంద్రబాబూ 14 ఏళ్లు ఏం చేశావు?



గోవర్ధన్‌రెడ్డి రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు

- ఉమ్మడి మేనిఫెస్టో విడదల చేయలేని స్థితిలో కూటమి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: 'చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాలు సీఎంగా ఉన్నాడు. ఇప్పుడు అవకాశమిస్తే ప్రజల కోసం పనిచేస్తా అంటున్నాడు. అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు చేయలేదో సమాధానం చెప్పాలి' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని పిడూరుపాళెం, బద్దెవోలు, అక్కంపేట, మడమనూరు గ్రామాల్లో శుక్రవారం మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హామీలివ్వడమే తప్ప వాటిని నెరవేర్చడన్నారు. ఆయన్ను నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. గతంలో 600కు పైగా హామీలిచ్చి ఆరింటిని కూడా అమలు చేయని చరిత్ర బాబుదని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మీకు మేలు జరిగిందని భావిస్తేనే నాకు ఓటు వేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధైర్యంగా చెప్పారన్నారు. ఏదో ఒక విధంగా ఈ ఎన్నికల్లో గెలిచేందుకు చంద్రబాబు అవకాశవాద పొత్తులకు తెర తీసి ఎన్డీఏలో చేరాడన్నారు. అయితే బాబు మేనిఫెస్టోతో తమకు సంబంధం లేదని బీజేపీ తెగేసి చెప్పిందన్నారు. వారికి ఆయనపై ఎంత అపనమ్మకం ఉందో ఈ చర్య సూచిస్తోందన్నారు. టీడీపీతోపాటు పరువు తీసుకోవడం ఎందుకని భావించబట్టే బీజేపీ పెద్దలు ఉమ్మడి మేనిఫెస్టోపై తమ ఫొటోల ముద్రణకు కూడా ఒప్పుకోలేదన్నారు. సర్వేపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన తనను గెలపించాలని కోరారు. అంతకుముందు కాకాణికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, సర్పంచ్‌లు యూఎస్‌కే రెడ్డి, నారపరెడ్డి జాంబవతమ్మ, ఏడెం మల్లికార్జునరెడ్డి, మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, దండు అమర్‌నాథ్‌రెడ్డి, చిట్టమూరు నరసారెడ్డి, శ్రీహరిరెడ్డి, వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి, తిన్నెలపూడి రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గుండాల ఆదినారాయణ, కసిరెడ్డి ధనంజయరెడ్డి, కొండూరు రామచంద్రారెడ్డి, జనార్దనరెడ్డి, రఫీ, జానకి రామిరెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, జయశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కాకాణి

వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో రామిరెడ్డి, కాటంరెడ్డి

- రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

అల్లూరు: కూటమి నాయకులు ఎన్ని కుట్రలు చేసినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మారుతీకాలనీ, అల్లూరుపేట సత్రం, బీసీ కాలనీ, రజక కాలనీ, కోనేటి సత్రంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు మరోసారి ప్రజలను మభ్యపెట్టేందుకు అమలు చేయలేని హామీలను మేనిఫెస్టోలో ప్రకటించాడన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి మారుపేరు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమన్నారు. చేయగలిగిందే జగనన్న చెబుతారన్నారు. బాబు అధికారంలో ఉన్న సమయంలో ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ప్రజలందరికీ తెలుసన్నారు. టీడీపీని మేనిఫెస్టోను చూసి ఎవరూ మోసపోవద్దన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కందుకూరు పరిశీలకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, నాయకులు నీలం సాయికుమార్, బాలకృష్ణంరాజు, దైవాదీనం, ఇస్మాయిల్, సురేష్‌రెడ్డి, ఉస్మాన్, రసూల్, ఆంజనేయరాజు, జిలానీ, మాబాషా, జంషీర్, కోటి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

20 కుటుంబాల చేరిక

మారుతీకాలనీలో టీడీపీకి చెందిన 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి రామిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు.

విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ మండలంలోని కలివెలపాళెం, పెనుబర్తి గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఆదాల రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు – నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కొత్త కళను సంతరించుకున్నట్లు చెప్పారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందుతున్నట్లు చెప్పారు. తాను సర్వేపల్లి ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో నియోజకవర్గ అభివృద్ధి ఎంతగానో కృషి చేశానన్నారు. నెల్లూరు రూరల్‌ను ప్రత్యేక ప్రణాళికతో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, మాశెం సుధీర్‌కుమార్‌రెడ్డి, చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి, ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్, వేలూరు శివసునీల్ రెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లురెడ్డి, పార్లపల్లి మధుసూదన్‌రెడ్డి, పార్లపల్లి వీరరాఘవరెడ్డి, పోతుల అజయ్‌కుమార్‌రెడ్డి, చిల్లకూరు సుబ్బరామిరెడ్డి, పోతుల సుధాకర్‌రెడ్డి, నిప్పట్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిక

మలిరెడ్డి కోటారెడ్డి ఆధ్వర్యంలో కలివెలపాళెం గ్రామ టీడీపీ నాయకులు ఏలియా ఆదాల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచితమైన స్థానం కల్పించడం జరుగుతుందని తెలిపారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

- వైఎస్సార్‌సీపీ కందుకూరు అభ్యర్థి మధుసూదన్ యాదవ్



నాయకులతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుర్రా

కందుకూరు: ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కందుకూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధిపథంలో నడిపిస్తానని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. పట్టణంలోని 27వ వార్డులో పంచాయతీరాజ్ కార్యాలయం ఏరియా, పామూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చిరు వ్యాపారులతో మాట్లాడి కష్టసుఖాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బుర్రా మాట్లాడుతూ రెక్కల కష్టంపై ఆధారపడి జీవనం సాగించే ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారన్నారు. రాష్ట్రంలోని ప్రతి వర్గాలకు ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనందించినట్లు చెప్పారు. పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు కూడా చేసిందన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. చంద్రబాబు నాయుడు చేసిన కుట్రల వల్ల ప్రస్తుతం వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు పింఛన్లను ఇంటి వద్ద అందుకోలేకపోతున్నారని చెప్పారు. ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ యత్నిస్తోందని, ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డి, కందుకూరు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు షేక్ రఫీ, శిగా రవి, గోశరాజు రవి, మాల్యాద్రి, కె.వసంత, డీసీహెచ్ మాలకొండయ్య, జాజుల కోటేశ్వరరావు, మస్తాన్‌వలి, తానికొండ శ్రీను, పసుపులేటి వెంకటేశ్వర్లు, గణేశం గంగిరెడ్డి, రేణమాల అయ్యన్న, మహబూబ్ బాషా, పిడికిటి శంకర్, పాశం కొండయ్య, షేక్ హమీద్, నాగభూషణం, దాసరి బాలాజీ, వెంకటేశ్వర్లు, చనమాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- మామిడి పండ్ల దుకాణంలోకి దూసుకెళ్లిన లారీ
- మహిళ మృతి, ఆమె కోడలికి గాయాలు



లారీ దూసుకెళ్లడంతో ధ్వంసమైన దుకాణం

ఉలవపాడు: లారీ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ మహిళ ప్రాణం పోయింది. వాహనం మామిడి పండ్ల దుకాణంలోకి దూసుకెళ్లగా దుకాణంలో ఉన్న ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఉలవపాడు – రాజుపాళెం జంక్షన్ మధ్య జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఉలవపాడు అంబేడ్కర్ నగర్‌కు చెందిన ధన్యాసి కొండమ్మ (48) హైవే వెంబడి మామిడి పండ్ల దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తోంది. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం. భర్త గతంలోనే మృతిచెందాడు. కాగా దుకాణంలో ఆమెతో కోడలు వినీత ఉంటోంది. శుక్రవారం ఉదయం కొండమ్మ లోపల మామిడి పండ్లను సర్దుకుంటోంది. ఈ సమయంలో నూజివీడు నుంచి చిత్తూరుకు లారీ వెళ్తోంది. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా వాహనం దుకాణంలోకి దూసుకెళ్లింది. కొండమ్మను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. బయట కుర్చీలో ఉన్న వినీత కాలుకు బలమైన గాయమైంది. స్థానికులు వెంటనే కావలి ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్సై బాజీ రెడ్డి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు.



కొండమ్మ మృతదేహం

అదే కుటుంబంలో..

చాలా ఏళ్లుగా కొండమ్మ కుటుంబం ప్రతి సీజన్‌లో మామిడి పండ్ల దుకాణం ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తోంది. శుక్రవారం లారీ దూసుకొచ్చి ఆమె మృతిచెందింది. గత సంవత్సరం జూలై నెలలో కొండమ్మ అల్లుడు దార్ల గంగాధర్ మామిడి దుకాణం నుంచి బయటకు వచ్చి రోడ్డు దాటుతుండగా మోటార్‌బైక్ ఢీకొని మృతిచెందాడు. ఏడాది గడవకముందే మరో ప్రమాదం ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. సీజన్‌లో వ్యాపారం చేసుకుని డబ్బులు సంపాదించాలని చాలామంది హైవేపై ప్రమాదపుటంచున దుకాణాలు పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

వెంకటాచలం: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెంకటాచలం రైల్వే గేటు సమీపంలో శుక్రవారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కింద ప డి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయసు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. వైట్ కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్, బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధ్వంస కావ్యం

కావ్య కృష్ణారెడ్డి అలియాస్ దగుమాటి కృష్ణారెడ్డి.. జిల్లాలోనే మైనింగ్ మాఫియా డాన్‌గా ఎదిగాడు. తనకు భవిష్యత్‌ను ప్రసాదించిన పుట్టిన గడ్డనే విధ్వంసం చేసి రూ.వేల కోట్ల సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నాడు. ప్రకృతి ప్రసాదించిన ఉదయగిరి నుంచి సూళ్లూరుపేట వరకు కంకర రాయి, గ్రావెల్, ఇసుక వంటి సహజ వనరులను దోచేశాడు. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా రియల్ వెంచర్లు వేసి విక్రయించి ప్రజలను నట్టేట ముంచేశాడు. ఒక్కసారి మండల ప్రజాపరిషత్ అధ్యక్ష పదవి ఇస్తేనే ఇదంతా చేయగలిగాడు. ఇక.. ఎమ్మెల్యే పదవిని ఇస్తే కావలి పరిస్థితి ఏమవుతుందోనని ఊహించుకుంటేనే వెంట్రుకలు నిక్కబొడుచుకుంటున్నాయి.



ఎంపీపీ పదవి ఇస్తేనే.. రూ.వెయ్యి కోట్లకుపైగా కొల్లగొట్టాడు

- ఇక ఎమ్మెల్యే పదవిస్తే.. కావలినే కబళిస్తాడేమో!
- పాతికేళ్ల క్రితం అద్దె కట్టలేని స్థితి నుంచి రూ.వేల కోట్ల సామ్రాజ్యానికి అధిపతి
- అక్రమ మైనింగ్‌తో ప్రకృతి సంపద దోపిడీ
- ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం
- పదవి కోసం ప్రశాంతంగా ఉన్న కావలిలో చిచ్చుపెట్టేలా కుట్రలు
- డబ్బు, మద్యంతో యువతకు ఎర

కావలి: మైనింగ్ మాఫియా డాన్ కన్ను ఇప్పుడు కావలి మీద పడింది. అక్రమ మైనింగ్, క్రషర్లతో జలదంకి మండలంలో ఆయన సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. ప్రశ్నించిన వారిని తన దండోపాయాలతో తొక్కేశాడు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్లు, పారిశ్రామికవాడల తో కనకపట్నంగా మారుతున్న కావలిని కబ్జా చేసేందుకు, ప్రశాంతతకు మారు పేరైన కావలిని తన అడ్డాగా చేసుకునేందుకు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు. డబ్బు, మందుతో యువతను, ఓటర్లను ప్రలోభపెట్టి గొడవలు సృష్టించడం ప్రారంభించాడు.

సుమారు పాతికేళ్ల క్రితం కావ్య కృష్ణారెడ్డి కావలిలో అద్దె ఇంట్లో ఉంటూ కామర్స్ అధ్యాపకుడిగా జీవితాన్ని ఆరంభించారు. ఆర్థిక పరిస్థితులు చాలక అద్దె చెల్లించలేని స్థితిలో అధ్యాపక వృత్తిని వదిలేసి రాజకీయాల్లోకి వచ్చాడు. అప్పటి రాజకీయ పరిస్థితులను అనుకూలంగా మార్చుకుని జలదంకి మండల పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. పదవిని అడ్డం పెట్టుకుని రియల్ ఎస్టేట్, క్వారీలతో కోట్లు కొల్లగొట్టడం ప్రారంభించాడు. రోడ్డు మెటల్ పేరుతో లీజుకు తీసుకున్న క్వారీలతో పాటు సమీపంలోని అనధికార భూముల్లో మెటల్ తవ్వేసి వందల కోట్ల రూపాయలు దోపిడీకి తెర తీశాడు. గడువు పూర్తయినా గనులను వదలకుండా సహజ వనరుల దోపిడీలో సరికొత్త చరిత్ర సృష్టించాడు. నిబంధనలకు విరుద్ధంగా క్వారీ మైనింగ్ భూముల్లో స్టోన్ క్రషర్లు, కూలీల నివాసాలు, పెట్రోల్ బంకులు వంటివి ఏర్పాటు చేశాడు. జలదంకి మండలానికి చెందిన ఆ చోట నేత అనతికాలంలోనే మిడిల్ క్లాస్.. నుంచి వందల రూ.కోట్లు ఆర్జించి శ్రీమంతుడిగా ఎదిగాడు.

స్టోన్ క్రషర్స్ పేరుతో..

గురు రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్ పేరుతో దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, డి.కవిత పేర్లతో జలదంకి మండలం గట్టుపల్లిలో సర్వే నంబరు 1015లో 9.47 ఎకరాల భూమిని రోడ్డు మెటల్ తవ్వకానికి 10 ఏళ్ల కాల పరిమితితో (26.02.2008 నుంచి 25.02.2018) మైనింగ్ లీజు హక్కులు పొందారు. అదే మండలం అన్నవరంలో సర్వే నంబరు 851/2పీలో 5.36 ఎకరాల భూమిని రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్ పేరుతో రోడ్డు మెటల్ తవ్వకానికి 10 ఏళ్ల కాల పరిమితితో (26.02.2008 నుంచి 25.02.2018) మైనింగ్ లీజు హక్కులు పొందారు. అయితే గట్టుపల్లి క్వారీలో టన్ను మెటల్ కూడా తవ్వకుండా అక్కడే క్రషర్లు, పెట్రోల్ బంకు, కూలీల నివాస భవనాలు, కార్యాలయం వంటివి ఏర్పాటు చేశాడు. ఈ క్వారీ నుంచి 28 వేల క్యూబిక్ మీటర్ల మెటల్ రవాణాకు పర్మిట్లు జారీ చేయడం విశేషం. ఈ క్వారీకి సంబంధించి పదేళ్ల లీజు కాలపరిమితి 2018 ఫిబ్రవరి 25వ తేదీ నాటికే పూర్తయితే 15 ఏళ్ల లీజు కాలపరిమితి పెంచమని ప్రతిపాదిస్తూ దరఖాస్తు చేసుకున్నాడు. అయితే అది మైనింగ్ శాఖ వద్ద పరిశీలనలో ఉండడంతో ఆ లీజు కొనసాగుతూనే ఉంది. గట్టుపల్లి క్వారీ పక్కనే ఉన్న ఇతరులు, ప్రభుత్వానికి చెందిన భూముల్లో సుమారు 7 లక్షల క్యూబిక్ మీటర్ల మెటల్‌ను అక్రమంగా తవ్వేసినట్లు మైనింగ్‌శాఖ తనిఖీల్లో బట్టబయలు అయింది. అన్నవరం క్వారీకి లీజు గడువు పెంచమనే అభ్యర్థనను మైనింగ్ శాఖ తిరస్కరించింది. అన్నవరం క్వారీతో పాటు పక్కనే ఉన్న భూముల్లో కూడా అక్రమంగా మైనింగ్ చేపట్టి 5 లక్షల క్యూబిక్ మీటర్ల మెటల్‌ను దోచేసిన వైనం వెలుగు చూసింది. ఈ క్వారీ లీజు గడువు ముగిసినప్పటికీ ఈ ఐదేళ్లుగా గట్టుపల్లి క్వారీ పర్మిట్‌తోనే విచ్చలవిడిగా మైనింగ్ చేపట్టి మొత్తంగా 12 లక్షల క్యూబిక్ మీటర్ల మెటల్‌ను అక్రమంగా తవ్వినట్లు మైనింగ్ శాఖ లెక్కలు తేల్చింది. అక్రమంగా తవ్వేసిన మెటల్ విలువ ప్రభుత్వ పరంగా సుమారు రూ.200 కోట్లు ఉంటుందని, మార్కెట్ ధర ప్రకారం రూ.600 కోట్లు ఉంటుందని అంచనా. కావ్య కృష్ణారెడ్డి అక్రమాలపై స్థానికులు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేయడంతో అసలు విషయాలు బయటకు వచ్చాయి. వీటి ఆధారంగా సదరు వ్యక్తులు స్పందనలో ఫిర్యాదు చేయడంతో అసలు బాగోతం వెల్లడైంది.

గుట్టు రట్టు చేసిన కరెంట్ బిల్లులు

గురు రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్, రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్ పేరుతో తీసుకున్న లీజు క్వారీల్లో అక్రమ మైనింగ్ జరగలేదని తప్పించుకునేందుకు కావ్య కృష్ణారెడ్డి చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. కరెంట్ బిల్లుల ఆధారంగా మైనింగ్ అధికారులు అక్రమ తవ్వకాల గుట్టును రట్టు చేశారు. క్రషర్లకు వినియోగించిన కరెంట్ బిల్లుల ఆధారంగా లెక్కలు తీయగా, 89 లక్షల యూనిట్లు వాడినట్లు తేలింది. టన్ను మెటల్ ప్రాసెస్ చేయడానికి 2.5 యూనిట్లు వినియోగం అవుతుందని లెక్కించి ఆ మేరకు 12 లక్షల క్యూబిక్ మీటర్ల మెటల్‌ను అక్రమంగా తవ్వేసినట్లు నిర్ధారించారు. విజయవాడ నుంచి వచ్చిన మైనింగ్ అధికారులు తనిఖీలు చేస్తే విస్తుబోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అనుమతులు లేకుండానే వేల కోట్ల విలువైన సహజ వనరులను దోచుకున్నట్లు గుర్తించి రూ.140 కోట్లు జరిమానా విధించారు. అయితే కోర్టుకెళ్లి స్టే తెచ్చుకుని కాలక్షేపం చేస్తున్నాడు.

గురు రాఘవేంద్ర కాంక్రీట్ మిక్సర్ ప్లాంట్లతో..

కావ్య కృష్ణారెడ్డి అక్రమాల దందా ఈనాటి కాదు. కొన్నేళ్ల క్రితమే నెల్లూరు పెన్నానది, నాయుడుపేటలోని స్వర్ణముఖి నది తీరంలో గురు రాఘవేంద్ర కాంక్రీట్ మిక్సర్ ప్లాంట్లు ఏర్పాట్లు చేసి కోట్లు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. ఈ యూనిట్‌కు కంకర, సిమెంట్ కొనుగోలు చేసినా.. ఇసుకను మాత్రం నదీ తీరాల్లోనిదే వాడినట్లు సమాచారం. ఈ రెండు ప్లాంట్ల నుంచి అను నిత్యం వందల ట్యాంకర్ల కాంక్రీట్ మిక్సర్ వ్యాపారం జరుగుతోంది. గతంలో ఇసుక ఉచితంగా ఉండేది. దీంతో యథేచ్ఛగా రూపాయి ఖర్చు లేకుండా నదీ తీరాలను నాశనం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక నూతన ఇసుక పాలసీ అమల్లోకి వచ్చింది. ఇసుకకు ధర నిర్ణయించింది. అయితే గురు రాఘవేంద్ర కాంక్రీట్ మిక్సర్ ప్లాంట్లలో ఈ ఐదేళ్లలో ఎంత ఇసుక వినియోగించారు.. ఎక్కడ కొనుగోలు చేశారనే వివరాల్లోకి వెళ్తే ఇక్కడి అక్రమాలు కూడా బట్టబయలు అవుతాయి. ఈ రెండు క్రషర్ల వద్ద కరెంట్ వినియోగాన్ని లెక్కిస్తే మరి కొన్ని నిజాలు కూడా వెలుగు చూస్తాయి.

‘స్పందన’తో అక్రమాలు వెలుగులోకి

గత ప్రభుత్వాల నేతలు, అధికారులు అండదండలతో చెలరేగిన మైనింగ్ అక్రమాలకు జగనన్నకు చెబుతాం కార్యక్రమం ద్వారా చెక్ పడిందనే చెప్పాలి. అక్రమ మైనింగ్ ద్వారా వేల కోట్లు దోచుకున్న డాన్ అక్రమాలపై గట్టుపల్లి గ్రామస్తులు జగనన్నకు చెబుదాంకు ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు.

నా పోరాటం ఫలించింది

– గుమ్మలపాటి సుబ్బారావు, గట్టుపల్లి పంచాయితీ ఉప సర్పంచ్

గురు రాఘవేంద్ర స్టోన్ క్రషన్ యజమాని డీవీ కష్ణారెడ్డి ఏళ్ల కాలంగా సహజ వనరులను దోచుకుంటున్నాడు. మా గట్టుపల్లి పంచాయతీలో సహజ వనరులు దోచుకుంటున్నా ఒక్క రుపాయి కూడా పంచాయతీకి సీనరేజ్ చెల్లించేవాడు కాదు. అతని అక్రమాలపై తొమ్మిదేళ్లుగా పోరాటం చేస్తున్నందుకు మా కుటుంబంపై దాడులు చేయించాడు. పోలీసులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. నా తొమ్మిదేళ్ల పోరాటానికి జగనన్నకు చెబుతాం ద్వారా నా కల నెరవేరింది.

ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాం

– దివి నరేంద్ర చౌదరి, గట్టుపల్లి, జలదంకి మండలం

గురు రాఘవేంద్ర స్టోన్ క్రషన్ ద్వారా కావ్య కృష్ణారెడ్డి గట్టుపల్లి పంచాయతీలో దోపిడీ చేస్తున్నారు. అనుమతులు లేకుండా సహజ వనరులను దోచుకుంటున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మైనింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవడం మాకు సంతోషంగా ఉంది. ఈ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాం.

తమ్ముడి.. పొత్తు ధర్మం



కావలి నియోజకవర్గ ఓటర్లంతా జనసేన పార్టీ గుర్తు గాజు గ్లాసుకే ఓట్లు వేయాలని కావలి పట్టణ టీడీపీ నేత, మాజీ వార్డు కౌన్సిలర్ బిట్రగుంట శివప్రసాద్ ప్రచారం చేస్తున్నాడు. ఆయన చెబుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టీడీపీ రెబల్‌గా పోటీ చేస్తున్న పసుపులేటి సుధాకర్‌కు ఎన్నికల కమిషన్ గాజు గ్లాసు గుర్తు కేటాయించిన తర్వాత టీడీపీ, జనసేన సమీకరణల్లో భారీగా మార్పులు చోటు చేసుకున్నాయి. పొత్తు ధర్మం ప్రకారం జనసేన గుర్తుకు గాజు గ్లాసు గుర్తుపై ఓటేయమని ‘తమ్ముడు’ చెబుతున్న వీడియో వైరల్ మారడం చర్చనీయాంశమైంది. – కావలి

‘నన్ను గెలిపిస్తే.. ఊరూరా రికార్డ్ డ్యాన్స్‌లు’

కావలి : ‘నన్ను గెలిపిస్తే ఊరూరుకు డీజేలు.. రికార్డు డ్యాన్సులు పెట్టిస్తా’.. ఈ మాటలు ఎవరో మద్యం మత్తులో అన్న మాటలు కావు. ఎన్నికల ప్రచారంలో కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి మతిభ్రమించి ఇచ్చిన హామీ. గురువారం రాత్రి బోగోలు, కావలి తీరంలోని మత్స్యకార గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి, టీడీపీ నేతలు బీద రవిచంద్ర, వంటేరుతో కలిసి కావ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కావ్య ఏం మాట్లాడుతున్నాడో ఒక్క క్షణం వారికి సైతం అర్థం కాలేదు. మత్స్యకారులకు రికార్డు డ్యాన్స్‌లు పెట్టిస్తే చాలు, ఓట్లు గుద్దేస్తారు అనే చులకన భావంతో కావ్య కృష్ణారెడ్డి ఈ రకంగా మాట్లాడడంపై మత్స్యకారుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది.

ప్రతాప్‌రెడ్డి పోర్టు, హార్బర్ తెస్తే.. కావ్య రికార్డు డ్యాన్స్‌లు తెస్తాడా?

కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి రామాయపట్నంపోర్టు, జువ్వలదిన్నె హార్బర్ సాధించి పూర్తి చేసి, అనుబంధ పరిశ్రమల ద్వారా మత్స్యకారులకు స్వర్ణయుగం తెచ్చారు. అయితే కావ్య మాత్రం తనను గెలిపిస్తే రికార్డులు పెట్టిస్తా అంటూ మత్స్యకారులంటే మందు, చిందు అన్నట్లుగా మాట్లాడటంపై సర్వత్రా తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది. ఇప్పటికే రౌడీ రాజకీయాలు, కవ్వింపు వ్యాఖ్యలు, చిల్లర చేష్టలతో జనాలతో ఛీకొట్టించుకుంటున్న కావ్య కృష్ణారెడ్డి తాజాగా రికార్డు డ్యాన్స్ వ్యాఖ్యలు చేసి మత్స్యకార వర్గాలతోనూ ఛీకొట్టించుకుంటున్నారు.

చంద్రబాబుది హత్యారాజకీయాల చరిత్ర

- సంక్షేమ సారథిని తిరిగి సీఎం చేసుకుందాం
- ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



మేకపాటిని గజమాలతో సన్మానిస్తున్న స్థానిక నేతలు

వరికుంటపాడు: చంద్రబాబుది హత్యా రాజకీయాలు చేసే చరిత్ర అని ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై గతంలో విశాఖపట్నంలో, ఇటీవల విజయవాడలో హత్యాయత్నాలు, గతంలో చేసిన హత్యలు చూస్తే అర్థమవుతుందన్నారు. శుక్రవారం మండలంలోని తోటల చెరువుపల్లి, ధర్మవరం, నార్తు కొండాయపాళెం, కృష్ణంరాజుపల్లె, విరువూరు, గొల్లపల్లె, యర్రంరెడ్డిపల్లె, ఇస్కపల్లె, ఎన్టీ కాలనీల్లో విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళలతో రాష్ట్రం, కుటుంబం బాగుపడుతుందనే ఉద్దేశంతో ప్రతి పథకంలో వారిని భాగస్వామ్యం చేస్తూ సముచిత స్థానం కల్పించారన్నారు. కరోనా సమయంలో ఆయనే సీఎంగా లేకపోయుంటే ఎంతో మంది ప్రాణాలు గాలిలో పోయేవన్నారు. ప్రజలకు మంచి చేయాలంటే జగనన్నకే సాధ్యమన్నారు. చంద్రబాబు తన పాలనలో జన్మభూమి కమిటీలు పెట్టి తెలుగు తమ్ముళ్లకు, వారి బంధువులకు లబ్ధి చేకూరేలా చేశారన్నారు. జగనన్న పాలనలో అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు మేలు చేకూర్చారన్నారు. ఆయన మేలును మరువకూడదని ఓటు ద్వారా రుణం తీర్చుకోవాలన్నారు. ఎన్నికలైన మరుసటి రోజే టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమెరికా, ఎంపీ అభ్యర్థి సౌతాఫ్రికా వెళ్లిపోతారన్నారు. తాను నియోజకవర్గ ప్రజలను కనిపెట్టుకుని ఉన్నానని ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. రాష్ట్రానికి జగనన్న మేనిఫెస్టో రూపొందిస్తే, జిల్లా అభివృద్ధికి ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి మేనిఫెస్టో రూపొందించారన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని, ఉదయగిరి ఎమ్మెల్యేగా తనను ఫ్యాను గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ అలిఅహ్మద్, మండల కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు, సొసైటీ అధ్యక్షుడు జి.రామాంజనేయులు, జేసీఎస్ కన్వీనర్ బి.వెంకటేశ్వర్లు, నాయకులు మాగంటి సిద్ధయ్య, దాసరి యర్రాఓబయ్య, పి.లక్ష్మమ్మ, వరలక్ష్మయ్య, ఎం.శ్రీను, శ్రీధర్, జె.వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు, బి.రాజేంద్ర, ఆర్.మధుసూదన్‌రావు, జిలానీ బాషా, నరసారెడ్డి, చెన్నారాయుడు, బి.మురళీ,ఎస్.రంగయ్య, బి.కొండమ్మ, వై.సరోజనమ్మ పాల్గొన్నారు.

వీపీఆర్ అంటే వేమన్న ప్యాకేజీ రాజకీయం

- ఫ్రస్టేషన్‌తోనే ఆనం పరుష వ్యాఖ్యలు
- ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



నాగులపాడులో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

ఆత్మకూరురూరల్: తాము చేసిన మంచిని చెప్పుకుని ఓట్లు అడగడం రాజకీయ నాయకుల లక్షణమని, టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వ్యక్తికి, పార్టీకి ప్రజాదరణ లేకపోవడంతో ఫ్రస్టేషన్‌తో పరుష వ్యాఖ్యలు చేస్తున్నారని పరోక్షంగా ఆనంపై ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. మరొకాయన.. తన పేరుకు తగ్గట్టే ‘వేమన్న ప్యాకేజీ రాజకీయం’ (వీపీఆర్) నడుపుకుంటూ తన పేరుకు సరికొత్త అర్థాన్ని చాటుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మండలంలోని రావులకొల్లు, చెర్లోయడవల్లి, నాగులపాడు, నారంపేట, నువ్వూరుపాడు, అశ్వనీపురం, జంగాలపల్లి, దేపూరు, బండారుపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం విక్రమ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాగులపాడులో విలేకరులతో మాట్లాడు తూ తాను ఆత్మకూరు అభివృద్ధికి దోహదపడే హైలెవల్ కెనాల్, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ తదితర ముఖ్యమైన అంశాలు ప్రస్తావిస్తుంటే టీడీపీ అభ్యర్థి ఆనం మాత్రం వ్యక్తిగత విమర్శలు, దూషణలు చేస్తూ నిరాశ, నిస్పృహలతో మాట్లాడుతున్నారన్నారు. ఇటీవల ‘వాడు కలెక్టరేనా?’ అంటూ ప్రజల సమక్షంలో వ్యాఖ్యానించడం ఆయన అహంకారానికి నిదర్శనంగా కనిపిస్తుందన్నారు. చేజర్ల మండలం ఆదూరుపల్లిలో చేజర్ల జెడ్పీటీసీ పేర్ల పార్థసారథి అనే యాదవ యువకుడిని ఉద్దేశించి ఆయన తోలు నలుపు రంగుతో ఉంటుందని ఎగతాళి చేస్తూ మాట్లాడడం ఆయనకు తగదన్నారు.

10 ఏళ్లు ఏం చేశావయ్యా..

హైలెవల్ కెనాల్‌కు సంబంధించి 2006లో శంకుస్థాపన జరిగితే 2009 నుంచి 2014 వరకు రాష్ట్ర మంత్రిగా ఉండి, 2014 నుంచి 2019 వరకు టీడీపీలో అనధికార ఎమ్మెల్యేగా అధికారం చెలాయించిన ఆనం పదేళ్ల కాలంలో హైలెవల్ కెనాల్‌ను ఎందుకు పట్టించుకోలేదో జవాబు చెప్పాలన్నారు. తొలి దశ పనులతో పాటు రెండో దశ పనులను కూడా తన తండ్రి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో సాధించిన విషయం ఈ ప్రాంతంలో ఉన్న ప్రతి ఒక్కరికి తెలుసన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 80 వేల ఎకరాల రైతుల భూములకు చట్టబద్ధత కలిగించి 8 వేల కోట్ల విలువైన ఆస్తిని రైతులకు అందించిన చరిత్ర తమకు ఉందని, ఎవరి విశ్వసనీయత ఏమిటో మే 13న జరగనున్న ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారన్నారు. ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు అధ్యక్షుడు జితేంద్రనాగ్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రసన్నలక్ష్మీ, జేసీఎస్ కన్వీనర్ రాజేంద్ర, వైస్ ఎంపీపీ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

అదదండీ.. నా కథ



హలో.. నేను ఎవరో తెలుసు కదా. అదే నండి.. మీ రాతలను, ప్రభుత్వాల రాతలను మార్చేది నేనే. నా పేరు ‘ఓటు’. అబ్బా.. ఇప్పటికి గుర్తు పట్టారు. అది సరే కానీ నేను మీ చేతికి ఎలా వచ్చానో నా కథ తెలుసా!. స్వాతంత్ర్యానికి పూర్వం 1907లో రాయల్ కమిషన్ స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఓటు హక్కుపై కొన్ని సిఫార్సులు చేసింది. 1909లో కౌన్సిల్ చట్టం ద్వారా ఓటు హక్కును 10.6 శాతం పెంచారు. ఆ తర్వాత రాజ్యాంగ పరిషత్ ఎన్నికల సందర్భంగా 28.5 శాతం మంది ప్రజలకు ఓటు హక్కు కల్పించింది. స్వాతంత్ర్యం తర్వాత రాజ్యాంగంలోని అధికరణ 325 ప్రకారం కుల, మత, వర్గ, జాతి, ప్రాంత, లింగ భేదాలు తేడాలతో ఏ వ్యక్తికి ఓటు హక్కు నిరాకరించకూడదని నిర్దేశించింది. 1952లో సాధారణ ఎన్నికల సందర్భంగా 326 అధికరణం కింద సార్వత్రిక ప్రయోజన ఓటు హక్కు కలించారు. 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా అప్పటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు హక్కు కనీస వయో పరిమితిని 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు కుదిరించింది. బ్యాలెట్ పత్రంపై స్టాంపుతో ఇంకు ముద్రవేసే స్థాయి నుంచి మీట నొక్కి ఓటు వేసే స్థాయికి నన్ను చేర్చారు. అలా ఆంగ్లేయుల కాలంలో ప్రారంభమైన నా ప్రస్థానం చివరికి మీ చేతిలో ఆయుధంగా మారాను. అదండీ నా కథ.

– నెల్లూరు (దర్గామిట్ట)

నెల్లూరులో హోమ్ ఓటింగ్ ప్రారంభం

- తొలిరోజు 94 మంది ఓటర్లు వినియోగం

నెల్లూరు (బారకాసు): భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు 85 ఏళ్ల పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు హక్కు కల్పించే హోమ్ ఓటింగ్ ప్రక్రియ నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గంలో శుక్రవారం ప్రారంభమైంది. ఇందు కోసం నమోదు చేసుకున్న వారి ఇళ్ల వద్దకు ప్రత్యేకంగా కేటాయించిన పలువురు అధికారులు, సిబ్బంది వెళ్లి వారి నుంచి ఓటు సేకరించే ప్రక్రియ చేపట్టారు. మొత్తం 153 మంది హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా తొలి రోజు 94 మంది తమ ఓటు హక్కును ఇంటి వద్దనే వినియోగించుకున్నారు.

‘ప్రసన్న’ వదనం

వైఎస్సార్‌సీపీ కంచుకోట కోవూరు



కోవూరులో మళ్లీ ప్రసన్న వదనం వికసించనుంది. గడిచిన ఎన్నికల ఫలితాలు, తాజా రాజకీయ పరిణామాలు ఎన్నికల ముందే ఫలితాలు చెబుతున్నాయి. శత్రువును సైతం ‘అన్నా.. అని ఆప్యాయతగా పిలిచే వ్యక్తిత్వం ఆయన ఆభరణం. కష్టంలో వస్తే.. కరిగిపోయి అభయహస్తం అందించే దయా గుణం ఆయన సొంతం. అందుకే ఆయన్ను కోవూరు తన గుండెల్లో దాచుకుంది. కోవూరు అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది సార్లు పోటీ చేసిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆరు దఫాలు అప్రతిహత విజయాన్ని అందుకున్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయడానికి ప్రజలు ‘సిద్ధం’ అంటున్నారు.

- 2012 ఉప ఎన్నికల్లో టీడీపీపై 14.64 శాతం ఓట్ల ఆధిక్యం
- 2014 ఎన్నికల్లో కేవలం 0.3 శాతం ఓట్ల తేడాతో ఓటమి
- 2019 ఎన్నికల్లో టీడీపీపై 19.41 శాతం తేడాతో విజయం
- ఈ దఫా ఎన్నికల్లో ఈ శాతం మరింతగా పెరిగే అవకాశం

కోవూరు: జిల్లాలో వైఎస్సార్‌సీపీ కంచుకోట నియోజకవర్గాల్లో కోవూరు ఒకటి. మరోసారి అది నిరూపితం కానుందనే ప్రజాభిప్రాయం బలంగా వినిపిస్తోంది. 2009 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వైఎస్సార్ మరణం తర్వాత చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలిచారు. తన ఎమ్మెల్యే పదవిని తృణప్రాయంగా వదులుకున్నారు. ఆ పార్టీ తరఫున ఉమ్మడి రాష్ట్రంలో రెండో ఎమ్మెల్యేగా గెలిచిన చరిత్రను లిఖించారు. ‘అసెంబ్లీ టైగర్’గా ‘నల్లపరెడ్డి’ బ్రాండ్‌కు రాష్ట్ర రాజకీయాల్లో ఎంతో గుర్తింపు ఉంది. దివంగత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి జిల్లా రాజకీయాలను శాసించారు. ఆయన రాజకీయ వారసుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రాజకీయ ఆరంగేట్రం నుంచి ఇప్పటి వరకు ఎనిమిది సార్లు పోటీ చేసి ఆరు సార్లు విజయకేతనం ఎగుర వేశారు. కోవూరు ప్రజల ఆత్మబంధువుగా మారారు. ఆయన రెండు దఫాలు ఓటమి పాలైనా అత్యంత స్వల్ప ఓట్ల తేడానే ఓడిపోయారు.

2012 ఉప ఎన్నికల్లో 14.64 శాతం ఆధిక్యం

2012లో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ప్రసన్నకుమార్‌రెడ్డి ఆర్థికంగా బలవంతులతో పోటీ పడ్డారు. ఆ ఎన్నికల్లో పోల్ అయిన ఓట్లలో 42 శాతం ఓట్లతో ‘వైఎస్సార్‌సీపీ రెండో ఎమ్మెల్యే’గా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. అదే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డికి 28.64 శాతం ఓట్లు వస్తే.. అప్పటి అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి 23.53 శాతం ఓట్లు వచ్చాయి. వైఎస్సార్‌సీపీ తన సమీప ప్రత్యర్థి టీడీపీ కంటే 14.64 శాతం ఓట్ల ఆధిక్యతను సాధించింది.

2014లో 0.3 శాతం ఓట్ల తేడాతో ఓటమి

2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రసన్నకుమార్‌రెడ్డి అత్యంత స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అప్పటి వరకు ఆయన వెన్నంటే ఉన్న మండల స్థాయి లీడర్లంతా వెన్నుపోటు పొడిచి టీడీపీలోకి వెళ్లిపోయారు. ఆ ఎన్నికల్లో టీడీపీకి 44.9 శాతం ఓట్లు వస్తే.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డికి 44.6 శాతం ఓట్లు వచ్చాయి. అందరూ వెన్నుపోటు పొడిచి వెళ్లినా.. అత్యంత ప్రజాదరణతో కేవలం 0.3 శాతం ఓట్లతో ప్రసన్నకుమార్‌రెడ్డి ఓటమి పాలయ్యారు.

2019లో 19.41 శాతం ఆధిక్యత

2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఏకపక్షంగా తీర్పు ఇచ్చారు. ఆ ఎన్నికల్లో పోల్ అయిన ఓట్లలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డికి 56.55 శాతం ఓట్లు లభించగా, టీడీపీ అభ్యర్థి పోలంరెడ్డికి కేవలం 37.14 శాతం ఓట్లు పడ్డాయి. ఈ లెక్కన వైఎస్సార్‌సీపీ 19.41 శాతం ఓట్ల ఆధిక్యతను సాధించింది.

ప్రతి కుటుంబానికి సంక్షేమం

గడిచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధితో గతంలో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయని వారు సైతం ఈ దఫా ఎన్నికల్లో కచ్చితంగా వేస్తారనే ధీమాతో ఆ పార్టీ ఉంది. గత ఎన్నికల్లోనే వైఎస్సార్‌సీపీని చేరుకోలేనంతగా టీడీపీ కంటే 19.41 ఓట్ల శాతం తేడా ఉందని, ఈ దఫా ఎన్నికల్లో ఇది మరింతగా పెరిగి అవకాశాలు లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రధానంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెబితే చేస్తాడనే నమ్మకం ప్రజల్లో ఉంది. చంద్రబాబు ఎన్నికల కోసమే హామీలిస్తాడనే అభిప్రాయం బలంగా ఉంది. తాజాగా ప్రకటించిన రెండు పార్టీల మేనిఫెస్టోలను పోల్చుకుంటున్న ప్రజలు ఈ దఫా కూడా వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపుతున్నట్లు అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోకు ప్రజల మద్దతు

- ఎండీ ఖలీల్‌అహ్మద్



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఖలీల్‌అహ్మద్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మద్ చెప్పారు. శుక్రవారం నగరంలోని 54వ డివిజన్ ఇస్లాంపేట, నేతాజీనగర్, 11వ డివిజన్‌లో బిట్‌సెంటర్, పోలేరమ్మగుడి వీధి, జెండాల సెంటర్, 49వ డివిజన్ ఈద్గామిట్ట, తూకుమానుమిట్ట, గోపి టీసెంటర్, 50వ డివిజన్ రంగనాయకులపేట, పీఎంఆర్ స్కూల్‌వీధి, సంతపేట మార్కెట్ సెంటర్, ములుమూడి బస్టాండ్, ఆజాద్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను స్వాగతిస్తున్నట్లు ప్రజలందరూ ఆశీర్వదిస్తున్నారన్నారు. జగనన్న నూతనంగా విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. నగర నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగాయన్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ కొనసాగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలన్నారు. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డిని, నెల్లూరు నగర నియోజకవర్గ అభ్యర్థిగా తనను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థిస్తున్నానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ సఫియాబేగం, గోతం అరుణ, వందవాసి రాజేశ్వరి, గుంజి జయలక్ష్మి, ఏపీ ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదెల సుధీర్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యులు షేక్ జమీర్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.